సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

మహారాణిపేట: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ మీటర్ రీడర్లు ఆందోళన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమంలో మీటర్ రీడర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

29తో ముగియనున్న లేపాక్షి వార్షిక క్లియరెన్స్ సేల్



లేపాక్షి ఎంపోరియంలో రాయితీ ధరలకు విక్రయిస్తున్న హస్తకళల ఉత్పత్తులు

అల్లిపురం: జగదాంబ జంక్షన్ సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియంలో నిర్వహిస్తున్న వార్షిక క్లియరెన్స్ సేల్ ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని ఎంపోరియం మేనేజర్ కార్తీక్‌కుమార్ తెలిపారు. ఉగాది డిస్కౌంట్ సేల్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అన్ని హస్తకళలు, చేనేత వస్త్రాలను 10 నుంచి 40 శాతం తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీహెచ్‌డీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు ఉగాది పండగ సీజన్‌లో సాటిలేని ధరలకు ప్రత్యేక కలెక్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. లేపాక్షి జగదాంబ షోరూమ్‌తో పాటు, రామ్‌నగర్ వీఎంఆర్‌డీఏ కాంప్లెక్స్, విమానాశ్రయం వద్ద గల లేపాక్షి ఎంపోరియంలో వార్షిక క్లియరెన్స్ సేల్, ఉగాది సేల్ ఉంటుందని కార్తీక్‌కుమార్ వెల్లడించారు.


అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్ అందిస్తున్న దాత అప్పారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి నగరంలోని శివాజీపాలేనికి చెందిన దువ్వి అప్పారావు సోమవారం రూ.లక్ష 116 విరాళమిచ్చారు. సంబంధిత విరాళాన్ని చెక్ రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందజేశారు.

బీఈడీ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రంలో డీన్ కేశవరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని సోమవారం యూనివర్సిటీ పీజీ పరీక్షల డీన్ ఆచార్య కేశవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణ తీరుపై విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజును అడిగి తెలుసుకున్నారు. పరీక్షకు 95 మంది నమోదు చేసుకోగా.. 94 మంది హాజరైనట్లు షారోన్‌రాజు తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని వివరించారు.

పన్నులు సకాలంలో చెల్లించండి.. జీవీఎంసీ అభివృద్ధికి సహకరించండి.. ప్రజల ముక్కు పిండి పన్నులు వసూలు చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ, వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో జీవీఎంసీ యంత్రాంగం చూపట్లేదు. పన్ను బకాయిలున్న వారింటికి వెళ్లి కుళాయిలు కట్ చేస్తున్న అధికారులు.. నెలల తరబడి మూసుకుపోయిన డ్రైనేజీల మధ్య మురుగుతో సావాసం చేస్తున్న ప్రజల దుస్థితిపై కళ్లు తెరవట్లేదు. 33వ వార్డు వెంకటేశ్వరమెట్టలో కాలువలు పూడుకు పోయి, స్థానికులు దుర్గంధం మధ్యే బతుకులు వెళ్లదీస్తున్నారు.

డ్రైనేజీ పూడ్చేశారు!



విద్యుత్ డీపీ బాక్స్ వద్ద కాలువ పూడుకుపోయి రోడ్కెక్కిన మురుగు

- 150 మీటర్ల మేర డెబ్రిస్‌తో కప్పేసిన నిర్మాణదారులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- జెడ్సీకి ఫిర్యాదు చేసినా.. చర్యలు నిల్



వెంకటేశ్వరస్వామి ఆర్చి వద్ద నిలిచిపోయిన మురుగునీరు



కాలువను పూడ్చేసి ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రహరీ



కాలువ పూడ్చేయడంతో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ మురుగు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వెంకటేశ్వరమెట్టలో భవన నిర్మాణదారుల నిర్వాకం, పారిశుధ్య కార్మికుల అలసత్వం వెరసి 150 మీటర్ల మేర కాలువ పూడుకుపోయింది. మురుగు నీటి ప్రవాహానికి మరో మార్గం లేక రోడ్డే డ్రైనేజీగా మారింది. దీంతో ఎక్కడికక్కడ రోడ్డు మొత్తం మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి ఈ సమస్య ఉన్నా ప్రజారోగ్య విభాగం పట్టించుకోవట్లేదని వాపోతున్నారు.

నడిచి వెళ్లాలన్నా ఇబ్బందే..

గోవింద్ రోడ్డులో వాటర్ సర్వీసింగ్ కేంద్రానికి సమీపంలో కాలువ మొత్తం పూడికతో నిండిపోయింది. ఎక్కడికక్కడ నిర్మాణదారులు డెబ్రిస్‌తో కాలువలను పూడ్చేశారు. దీంతో మురుగునీరు మొత్తం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకల సమయంలో ఈ రోడ్డుపై నడిచి వెళ్లాలంటే పాదచారులు భయపడే పరిస్థితి. కాస్త వేగంగా వాహనాలు వచ్చినా.. మురుగునీరు పాదచారులు, ఇతర వాహనదారులపై పడటం తప్పనిసరి. దీంతో చాలా జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.

ఏడాదిగా ఇదే పరిస్థితి

ఈ ప్రాంతంలో డ్రైనేజీల దుస్థితి ఏడాదిగా ఇలానే ఉందని స్థానికులు వాపోతున్నారు. ఒక పక్క కంకర పిక్కలు రోడ్డుపై పడివుండటం, మరోపక్క మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుండటంతో తరచూ వాహన చోదకులు జారి పడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. పారిశుధ్య సిబ్బందికానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులిచ్చినా తమ దుస్థితిని మాత్రం తొలగించట్లేదంటున్నారు.

ఫిర్యాదిచ్చినా పట్టించుకోలే..



డ్రైనేజీ దుస్థితిపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం. ఫిర్యాదిచ్చి పది రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు చర్యలు కాదు కదా.. కనీసం ఇక్కడికి వచ్చి పరిశీలించింది లేదు. జీవీఎంసీ కాలువను డెబ్రిస్‌తో పూడ్చేసినా, నిర్మాణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. కనీసం కాలువ పునర్నిర్మాణానికీ చొరవ చూపట్లేదు. ఇప్పటికైనా స్థానికుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకుని, అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి.

– పచ్చిరిపల్లి రాము, 33వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు

ఏవీఎన్ విద్యార్థులకు మలబార్ స్కాలర్‌షిప్‌లు



మలబార్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లు అందుకుంటున్న ఏవీఎన్ కళాశాల విద్యార్థినులు

అల్లిపురం: ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్‌లు సోమవారం అందించారు. ఈ స్కాలర్‌షిప్‌లను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బొడ్డేపల్లి రాధ, ఏయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్, ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జోనల్ హెడ్ కె.సునీత, సఫాన్‌లు మాట్లాడుతూ సంస్థ సీఎస్సార్ కార్యకలాపాల్లో భాగంగా 169 మంది విద్యార్థులకు రూ.8 వేలు, రూ.10 వేలు చొప్పున రూ.13.82 లక్షలు అందించినట్లు వెల్లడించారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

పీ-4 సర్వేతో పేదరిక నిర్మూలన చర్యలు



గ్రామ సభలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది, ప్రజలు

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా చేపట్టిన పీ-4 సర్వేతో పేదరిక నిర్మూల చర్యలు సులభతరమవుతాయని ఆర్‌ఐ టి.సీతారామయ్య అన్నారు. 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ జరిగింది. సభలో పాల్గొన్న ఆర్‌ఐ మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా సన్నకారు రైతులు, చిరువ్యాపారులకు తగినంత సహాయం అందుతుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా, పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ఈ సర్వే వెసులుబాటు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గోపీకృష్ణ, సచివాలయ కార్యదర్శులు భార్గవ్ సుతేజ్, పీవీ కిరణ్‌కుమార్, రమేష్, రియాజ్, త్రివేణి, నూర్జహాన్, చిరంజీవి, జాన్, హారిక, కృష్ణకుమారి, రమ్య, కిరణ్, చంద్రశేఖర్, గీత తదితరులు పాల్గొన్నారు.

కోడలి చిత్రహింసలు తాళలేక విశాఖ చేరిన వృద్ధురాలు

- మహిళా షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం



షెల్టర్ హోంలో గౌరమ్మ

సీతమ్మధార: కోడలు పెట్టే చిత్రహింసలు తాళలేక విశాఖ చేరింది కర్నూల్ జిల్లా ఆదోనికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు సున్నాపు గౌరమ్మ. రైల్వే పోలీసుల సమాచారంతో ఆమెకు టీఎస్సార్ మహిళా షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. కర్నూల్ నుంచి మూడు రోజుల క్రితం విశాఖ వచ్చిన గౌరమ్మ రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండడంతో రైల్వే పోలీసులు ఏయూటీడీకి సమాచారం అందించారు. దీంతో ఏయూటీడీ కేర్ టేకర్ ఎస్.శ్రీనివాస్ ఆమెను మహిళా షెల్టర్ హోమ్‌కు తీసుకువచ్చారు. గౌరమ్మ మాట్లాడుతూ తమ కుమారుడు లేబర్ పని చేస్తుంటాడని, అతడు లేని సమయంలో కోడలు కొడుతూ చిత్రహింసలు పెడుతోందని తెలిపారు. కొడుక్కి చెప్పినా పట్టించుకోకపోవడంతో ఇల్లు వదిలిపెట్టి, వచ్చేశానన్నారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆమెకు టీఎస్సార్ మహిళల షెల్టర్ హోంలో వసతి కల్పించారు.

పిల్లలకు మంచి చెడులు చెప్పాల్సింది తల్లిదండ్రులే

- పోక్సో చట్టం అవగాహన కార్యక్రమంలో మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న 2వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వరలక్ష్మి

అల్లిపురం: పిల్లలకు మంచి ఏదో.. చెడు ఏదో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని నగరంలో 2వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి తెలిపారు. టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై ప్రేమసమాజంలో సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏ టచ్ ఎలాంటిదో, ఎవరిని దగ్గరికి రానివ్వకూడదో, ఎవరు ఎక్కడ తాకకూడదో పిల్లలకు చెప్పేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ధోరణిని తల్లిదండ్రులు త్వరగా విడనాడి, పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే, ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయన్నారు. పోక్సో చట్టంలో ప్రధాన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శిశు అభివృద్ధి అసోసియేషన్ ప్రతినిధి సులేఖ, న్యాయవాది అంజనికుమారి, పోలీస్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఏఎస్‌ఐ కాంతం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 10.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఒబిోష్ మిస్త్రీ వారి వారి సిబ్బందితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా జిల్లాకు చెందిన గజానన్ కుర్సేంగే విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్‌ఐకు అప్పగించారు. నిందితుడి నుంచి రూ.52.5 వేల విలువైన 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఎం.ఎన్.శాస్త్రి జీవితం ఆదర్శనీయం



ఐఐటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణరావును సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: విశిష్ట పరిశోధకుడిగా, పరిపాలన దక్షుడిగా జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి జీవితం నేటి యువతకు స్ఫూర్తిని కలిగిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో సోమవారం ఆచార్య ఎం.ఎస్.శాస్త్రి స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. వీసీ మాట్లాడుతూ ఆచార్య ఎం.ఎస్ శాస్త్రి స్మారక ఉపన్యాసం నిర్వహించడం, ఈ కార్యక్రమ ఏర్పాటుకు విభాగం చొరవ తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తు చేసుకోవడం, నేటి తరం యువతకు వీరిని పరిచయం చేయడం, వీరి పరిశోధనలు, విశిష్టతను తెలియజేయడం ముదావహమని చెప్పారు. ఉత్సుకత వ్యక్తి ప్రగతికి ప్రేరణ శక్తిగా నిలుస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ-కాన్పూర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యుడు ఎం.లక్ష్మీనారాయణరావు అన్నారు. నూతన అంశాలను నేర్చుకోవాలని తపన, జిజ్ఞాస విద్యార్థులు ఎల్లవేళలా కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, విభాగాచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు



డస్ట్ బిన్ వద్ద చెత్త తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: నీలమ్మవేపచెట్టు ప్రాంతంలో డస్ట్ బిన్ వద్ద వద్ద రోజుల తరబడి పేరుకుపోయిన చెత్త నిల్వలపై సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'స్వచ్ఛత.. అదెక్కడ'వార్తకు జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు స్పందించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీ, పారిశుధ్య సిబ్బందిని అక్కడికి పంపించి చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. కొత్త బిన్ ఏర్పాటు చేయాలని ఏఈతో పాటు ఎమినిటీస్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

జోన్-5కు ఒకటే వినతి



అర్జీ పరిశీలిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఒకే ఒక్క వినతి అందింది. జోనల్ కమిషనర్ బి.రాము మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణం పరిష్కరిస్తామన్నారు. ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళతో హెడ్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

సీతమ్మధార: తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసిన ఒక మహిళతో ఫోర్త్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. వివరాలిలా.. సీతమ్మధారలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో డీజిల్ వేయించేందుకు ఆదివారం అర్ధరాత్రి ఒక మహిళ కారులో వచ్చింది. బంక్ సిబ్బంది కారులో డీజిల్ వేయకుండా పెట్రోల్ వేయడంతో ఆమె ప్రశ్నించింది. దీంతో బంకు యాజమాని ఆ మహిళపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆమె వెంటనే నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న హెడ్ కానిస్టేబుల్ గోపినాథ్ బంకు యజమానికి స్నేహితుడు కావటంతో మహిళదే తప్పు అన్నట్లు దురుసుగా ప్రవర్తించాడు.ఆమెకు సపోర్ట్‌గా ఉండేందుకు వచ్చిన బంధువుల వాహనాలను ఆపి పత్రాలు చూపించాలని బెదిరించాడు. మహిళలకు రాత్రి సమయంలో ఇబ్బంది వస్తే అండగా ఉండాల్సిన పోలీసులు ఇలా దురుసుగా ప్రవర్తించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్‌పై నగర పోలీస్ కమిషనర్ తక్షణం చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కోరారు.

మ్యాచ్ భద్రతను పరిశీలించిన సీపీ



క్రికెట్ మ్యాచ్‌ను పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: ఐపీఎల్ మ్యాచ్‌కు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో సుమారు 1700 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా శాంతిభద్రతల, ట్రాఫిక్, క్రైం అధికారులను ఎప్పటికప్పుడు సీపీ అప్రమత్తం చేశారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగిస్తూ నిరంతరం పర్యవేక్షించారు. స్టేడియంలో కెన్ ఐ హెల్ప్ యు బోర్డులను ఏర్పాటు చేసి అభిమానుల సందేహాలను నివృత్తి చేశారు. చిన్నారులు తప్పిపోకుండా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్‌ను వినియోగించారు. ఇచ్చిన మాట ప్రకారం 55 మంది పాపాహోమ్ బాలబాలికలతో కలసి గ్యాలరీలో కూర్చొని వారిని ఉత్సాహపరిచారు.

క్యాబ్ డ్రైవర్లకు సామాజిక భద్రత చట్టాన్ని అమలుచేయాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న డ్రైవర్లు, సిటు నాయకులు

సీతమ్మధార: క్యాబ్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సామాజిక భద్రత చట్టాన్ని అమలు చేయాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ మోటారు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, ఓలా, ఉబర్, రాపిడో కార్మికుల సమస్యలపై విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం, జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కస్టమర్లకు ఉపయోగపడే ఉబర్, రాపిడో, ఓలా తరహా యాప్ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ డ్రైవర్లకు ఉరితాడు వంటి మోటార్ వెహికల్ చట్టం-2019ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టోల్ చార్జీలు తగ్గించాలని, గ్రీన్ ట్యాక్స్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, పి.రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవును.. మనం టీబీని అంతం చేయగలం

- ఘనంగా ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న భీమ్‌నగర్ పీహెచ్‌సీ సిబ్బంది, డాక్టర్ నిఖిల్, తదితరులు

అల్లిపురం: అవును..! మనం టీబీని అంతం చేయగలం.. అంటూ నినాదాలు చేస్తూ భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, క్షయవ్యాధి నివారణ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవగాహన ర్యాలీని పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్ ప్రారంభించారు. ఈ ర్యాలీ భీమ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది క్షయ వ్యాధి నివారణకు అవును..! మనం టీబీని అంతం చేయగలం నినాదంతో ప్రచారం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డీపీసీ శ్రీనివాసరావు, ఎస్టీ రవికిరణ్, ఎల్ఎస్ గోపీనాథ్, టీబీ హెచ్‌వీ రత్నం, జానకి, ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

చెడు సావాసాలతో జీవితం అంధకారం



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి కార్తీక్

బీచ్‌రోడ్డు: చెడు సావాసాలతో జీవితం అంధకారమవుతుందని నగరంలోని మూడో అదనపు జూనియర్ కోర్టు న్యాయమూర్తి జి.కార్తీక్ అన్నారు. బీచ్ రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాల ఆవరణలో జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులు కలిగి ఉంటే ఉన్నత అవకాశాలు కోల్పోతారన్నారు. ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి కేసులు ఉండరాదన్నారు. పోక్సో చట్టంలో కీలక అంశాలను వివరించారు. వివాహ వయసుకు ముందు కౌమార దశలో విద్యార్థులు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షకు గురి కావలసి వస్తుందన్నారు. పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించాలని, సెల్‌ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారొద్దని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. త్రీ టౌన్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, తల్లిదండ్రులను గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో చేసే తప్పులు జీవితాన్ని ఛిద్రం చేస్తాయన్నారు. లక్ష్యాన్ని గుర్తుచేసుకుంటూ మంచి జీవితాన్ని పొందాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలలో తెలిసో, తెలియకో భాగమైనా అవి జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విరిగిపడిన కొండచరియల పరిశీలన

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సత్యానగర్ కొండవాలు ప్రాంతంలో ఓ ఇంటిని ఆనుకుని ఉన్న కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఘటనా స్థలాన్ని సోమవారం జోన్-5 కమిషనర్ రాము సందర్శించి పరిశీలించారు. కొండచరియలను ఆనుకుని ఉన్న ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. విరిగిపడిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-5 ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, టీడీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com